రిపోర్టర్లు కావలెను
ప్రకాశం జిల్లాలో
'జాతీయ వార్త' తెలుగు దినపత్రికలో
పనిచేసేందుకు ఆసక్తి ఉన్న
రిపోర్టర్లు సంప్రదించగలరు
9908862557

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com





గురువారం | 12-3-2026 | ప్రకాశం | సంపుటి: 3 సంచిక: 614 పేజీలు: 2 వెల : రూ.7

## అభిమానం, ఆశీర్వాదం నడుమ..

# ఎమ్మెల్యే ఇంటూరి పెళ్లి రోజు వేడుకలు



* శ్రీశైలంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు
* శుభాకాంక్షలు తెలియజేసిన నాయకులు, అభిమానులు
* కేక్ కట్ చేసి పంచిన శ్రేణులు
* కందుకూరు నియోజకవర్గంలో విస్తృతంగా సేవా కార్యక్రమాలు
* అన్నక్యాంటీన్‌లో అన్నసేవ
* ఎమ్మెల్యే పేరిట ఆలయాల్లో పూజలు



















**కందుకూరు, మార్చి 11 (జాతీయ వార్త):** కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య దంపతుల 25వ వివాహ వార్షికోత్సవ వేడుకలను అభిమానులు, టిడిపి నేతలు, కార్యకర్తలు పండుగ వాతావరణంలో బుధవారం నిర్వహించారు. దంపతులిద్దరికీ పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. నియోజకవర్గంలో పలుచోట్ల కేక్ కట్ చేసి, సేవా కార్యక్రమాలు చేపట్టారు. కాగా, తమ వివాహ వార్షికోత్సవం సందర్భంగా... ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య దంపతులు బుధవారం తెల్లవారుజామున ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీశైలంలోని భ్రమరాంబికా మల్లికార్జున స్వామి ని దర్శించుకున్నారు. అధికారులు, పండితులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించారు. అనంతరం వేదమంత్రోచ్ఛారణలతో ఆశీర్వచనం అందజేశారు. స్వామివారి శేష వస్త్రాన్ని, తీర్థ ప్రసాదాలను అందజేశారు.

### అన్నక్యాంటీన్‌లో..

ఎమ్మెల్యే దంపతుల పెళ్లిరోజు సందర్భంగా టీడీపీ రాష్ట్ర ముస్లిం మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి షేక్ రఫీ ఆధ్వర్యంలో కందుకూరు పట్టణంలోని అన్న క్యాంటీన్లో ఉదయం అల్పాహారం అందజేశారు. అంతకుముందు పట్టణ టిడిపి అధ్యక్షుడు దామా మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో నేతలంతా కలిసి కేక్ కట్ చేసి ఎమ్మెల్యే దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. దంపతులిద్దరూ ఆయురారోగ్యాలతో జీవించేలా దేవుళ్లను ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అన్న క్యాంటీన్ చైర్మన్ ఉన్నం కొండలరావు, పార్టీ నేతలు చిలకపాటి మధు, వడ్డేళ్ల రవిచంద్ర, బెజవాడ ప్రసాద్, కూనం నరేంద్ర, ముచ్చు శ్రీను, చిలకపాటి మధు, షేక్ సలాం, రూబీ, సయ్యద్ అహ్మద్, ఫిరోజ్, షేక్ మున్నా, చుండూరి శ్రీను, కల్లూరి శైలజ, గడ్డం మాలకొండయ్య, ముప్పవరపు వేణు, పులి నాగరాజు, కాకుమాని ప్రవీణ్, మురారిశెట్టి సుధీర్, కొత్తూరి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

### అన్న క్యాంటీన్‌లో అన్నసేవ..

ఎమ్మెల్యే దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ.... ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు గారి క్లాస్ మేట్స్ కలిసి... అన్న క్యాంటీన్‌లో బుధవారం మధ్యాహ్నం అన్న సేవ నిర్వహించారు. అంతకుముందు కేక్ కట్ చేసి ఎమ్మెల్యే దంపతులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ.... వారి దాంపత్య జీవితం నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అన్న క్యాంటీన్ చైర్మన్ ఉన్నం కొండలరావు, సభ్యుడు కాకుమాని ప్రవీణ్, ఎమ్మెల్యే గారి క్లాస్మేట్స్ మద్ది ప్రసాద్, పువ్వాడి నరసింహారావు, చలంచర్ల రమణమూర్తి, పద్మనాభుని నాగబ్రహ్మాం, చీదేళ్ల బాలకృష్ణ, నూకల వెంకట సుబ్బారావు, పాలూరి ప్రసాదు, సత్యనారాయణ పాల్గొన్నారు.

### పుణ్యక్షేత్రం సిద్దేశ్వరంలో...

ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సౌజన్య దంపతులకు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ... కందుకూరు పట్టణానికి చెందిన టీఎం ఐఎన్ఆర్ ఆధ్వర్యంలో, ప్రముఖ శైవక్షేత్రం ఘటిక సిద్దేశ్వరంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీఎం ఐఎన్ఆర్ సభ్యులు భవనాసి వెంకటేశ్వర్లు, గుమ్మా శివ, మచ్చా మనోహర్, నాదెండ్ల శివ, జక్కుల శ్రావణ్ తదితరులు స్వామి అమ్మవార్లకు పూజలు చేశారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక



## ప్రకాశం

### కేజీబీవీలో ప్రవేశాలకు
## దరఖాస్తులు ఆహ్వానం



**గుడ్లూరు, మార్చి11 (జాతీయ వార్త):** మొగుళ్ళూరులోని కస్తూర్బా గాంధీ బాలికావిద్యాలయం(ఇంగ్లీష్ మీడియం)లో 2026-27విద్యా సంవత్సరంలో ప్రవేశాల కోసం ఈనెల 12వ తేదీ నుండి దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ అమృత జోష్న తెలిపారు. జూనియర్ బైపిజీలో 40 సీట్లు, పదో తరగతిలో రెండు, తొమ్మిదో తరగతిలో ఒకటి, ఎనిమిదో తరగతిలో రెండు, ఏడో తరగతిలో ఐదు, ఆరో తరగతిలో 40 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. ఇక్కడ చేరిన విద్యార్థినులకు ఉచిత వసతితో పాటు యూనిఫామ్, బుక్స్, న్యూట్రీషిన్ ఫుడ్, కంప్యూటర్ ఎడ్యుకేషన్, డిజి టల్ లెర్నింగ్, కెరీర్ గైడెన్స్, లైఫ్ స్కిల్స్ అందించబడుతుందని తెలిపారు. విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలకు 9849443056 ను సంప్రదించాలన్నారు.

### వైసీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని
## ఘనంగా నిర్వహించాలి
### నియోజకవర్గ ఇన్చార్జ్ బుర్ర మధుసూదన్ యాదవ్



**కందుకూరు, మార్చి 11 (జాతీయ వార్త):** వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15 వసంతాలు పూర్తి చేసుకొని 16వ సంవత్సరం లోకి అడుగుపెడుతున్న సందర్భంగా నియోజకవర్గంలో ఘనంగా వేడుకలు నిర్వహించాలని నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ బుధవారం ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 2 సంవత్సరాలుగా రాష్ట్రంలో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత అప్రజాస్వామిక విధానాలతో, అన్యాయంగా వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలపైన, నాయకులపైన దాడులు, ప్రజలపైన అక్రమ కేసులు బనాయించి ప్రజల అభివృద్ధి సంక్షేమాన్ని మరచిన పరిస్థితులలో పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో ప్రజల పక్షాన ప్రజాస్వామికంగా పార్టీయావత్తు చేస్తున్న పోరాటం గుర్తు చేసుకుంటూ పార్టీ జెండా ఆవిష్కరణ చేయవలసిందిగా విజ్ఞప్తి చేశారు. నియోజకవర్గంలో అన్ని మండలాలు, పట్టణంలో పార్టీ జెండా ఆవిష్కరించాలని, దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి గారి విగ్రహాలకు రంగులు వేసి పూలమాలలతో అలంకరించాలని, పలు సేవా కార్యక్రమాలతో బాధితులకు భరోసా కల్పిస్తూ పెద్ద ఎత్తున కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు.

## 13న రైతుల ఖాతాల్లో రూ 6 వేలు జమ

**ఒంగోలు, మార్చి 11 (జాతీయ వార్త):**ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక ప్రకటన చేశారు. రైతులు.. మహిళలకు ఉగాది కానుకగా రెండు కీలక అంశాలను వెల్లడించారు. రెండు రోజుల కలెక్టర్ల సదస్సులో భాగంగా ముఖ్యమంత్రి అనేక అంశాలను ప్రస్తావించారు. అధికారులకు దిశా నిర్దేశం చేశారు. అందులో భాగంగా రైతులు... మహిళలకు ఉగాది కానుకగా వారి ఖాతాల్లో నిధులు జమ చేయటంతో పాటుగా.. కొత్త ఇళ్ల గృహ ప్రవేశాలు చేయనున్నట్లు వెల్లడించారు. రైతుల ఖాతాల్లో రూ 6 వేలు జమ కానున్నాయి. ఈ నెల 13 అన్నదాత సుఖీభవ నిధులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని వెల్లడించారు. 3వ విడత కింద రాష్ట్రంలో 46.80 లక్షల మంది రైతులకు ఒక్కొక్కరికి రూ.6000 చొప్పున మొత్తం రూ.2,808 కోట్లు అందనున్నాయి. ఇందులో పీఎం కిసాన్ కింద కేంద్రం రూ.2000, అన్నదాత సుఖీభవ కింద రాష్ట్ర ప్రభుత్వం రూ.4000 చొప్పున జమ చేస్తాయి. 2 లక్షల 50 వేల ఇళ్ళు గృహ ప్రవేశాలు ఉగాదికి ఉంటాయని చెప్పారు. అదే విధంగా పోలవరం ప్రాజెక్టును 2027లో పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని చంద్రబాబు ప్రకటించారు. ఉత్తరాంధ్ర, రాయలసీమలో ఉన్న ప్రాజెక్టులు ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేస్తామని చెప్పారు.

## ఏపీలో స్విగ్గీ, జొమాటో సేవలు బంద్

**ఒంగోలు, మార్చి11 (జాతీయ వార్త):** ఇరాన్ యుద్ధం కారణంగా ఎల్పీజీ కొరత ఏర్పడటంతో దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల్లో హోటళ్లపై తీవ్ర ప్రభావం పడుతోంది. రోజురోజుకీ గ్యాస్ కొరత తీవ్రమవుతుండటంతో విజయవాడలో సమావేశమైన ఏపీ హోటల్స్ అసోసియేషన్ సంచలన నిర్ణయాలు తీసుకుంది. గ్యాస్ కొరతతో పాటు పెరుగుతున్న నిర్వహణ ఖర్చుల పట్ల హోటల్ యజమానులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గ్యాస్ పొదుపు చర్యల్లో భాగంగా స్టార్ హోటళ్లలో జుమాటో, స్విగ్గీ వంటి ఆన్‌లైన్ ఆర్డర్లను త్వరలోనే నిలిపివేస్తామని అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. గ్యాస్ ఆదా చేసేందుకు ప్రతి సోమవారం రెస్టారెంట్లను పూర్తిగా మూసివేసి, 'వీక్లీ హాలిడే' ప్రకటించనున్నారు. దీనివల్ల కొంతవరకు గ్యాస్ ఆదా అవుతుందని భావిస్తున్నారు. రాత్రి 10 గంటల వరకే రెస్టారెంట్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లను నడిపేలా సమయం కుదించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరారు.

### విద్యార్థులు టెన్షన్ పడొద్దు..
## ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయండి

- విద్యార్థులు ప్రయోజకులు కావడానికి టెన్త్ తొలిమెట్టు
- వారిలోని నైపుణ్యాలను వెలికి తీయాలి
- పాఠశాలల ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి





**కందుకూరు, మార్చి 11 (జాతీయ వార్త):** పదో తరగతి విద్యార్థులు పరీక్షలంటే భయపడాల్సిన అవసరం లేదని, చదివిన విషయాలను ఆత్మవిశ్వాసంతో పరీక్షలలో రాయాలని పాఠశాలల ఆర్జేడీ బి.లింగేశ్వర రెడ్డి అన్నారు. బుధవారం కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పదో తరగతి విద్యార్థినులతో మాట్లాడారు. త్వరలో జరగనున్న టెన్త్ పరీక్షలపై విద్యార్థులు టెన్షన్ పడొద్దని, ధైర్యంగా ఉండి పరీక్షలు రాయాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయులు చెప్పే సూచనలు, సలహాలు తప్పక పాటించి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదుల భవన నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ఆర్జేడీ వెంట ఎంఈఓ కె. సుబ్బారెడ్డి, కెజిబివీ ప్రత్యేకాధికారి స్వాతి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



### టెన్త్.. తొలిమెట్టు

విద్యార్థులు ప్రయోజకులు కావాలంటే పదవ తరగతి ఉత్తీర్ణత తొలిమెట్టని ఆర్జేడీ బి.లింగేశ్వర రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. పదవ తరగతి విద్యార్థులకు మందరోజుల ప్రణాళికలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఆయన మాట్లాడుతూ త్వరలో జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను భయపడకుండా రాసి మంచి మార్కులు సాధించాలని సూచించారు. అలాగే ఉపాధ్యాయులు విద్యార్థులకు పదవ తరగతి తర్వాత ఏ కోర్సులు చేస్తే ఏ ఏ ప్రయోజనాలుంటాయి అనే విషయాలను తెలియజేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి ఒక లక్ష్యాన్ని పెట్టుకొని చదువుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పరీక్షా సామగ్రి, హాల్ టిక్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె సుబ్బారెడ్డి, హెచ్ఎం ఎం. నరసింహ మూర్తి, సీనియర్ ఉపాధ్యాయులు రమణయ్య, సిహెచ్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ సిబ్బంది, సీఆర్ఎంటీ ఎం.వి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నైపుణ్యాలను వెలికి తీయాలి

విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్ర సాంకేతిక నైపుణ్యాలను వెలికి తీయాలని ఆర్జేడీ లింగేశ్వర రెడ్డి అన్నారు. పట్టణంలోని అమలనాధునివారిపాలెం ఆదర్శ పాఠశాలలో జీ - ఎఫ్ఎల్ఎన్ 75 రోజులు కార్యక్రమాలను బుధవారం ఆయన పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. జూదూ పిటారా, జీ ఎఫ్ఎల్ఎన్ మెటీరియల్ ను ఉపయోగించి విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో పాఠాలు బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ కె. సుబ్బారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## పథకాల అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధి చూపాలి

- వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు



**కందుకూరు, మార్చి 11 (జాతీయ వార్త):** రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఎన్నికల నాడు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలకు కట్టుబడి చిత్తశుద్ధితో అమలు చేయాలని ఏ.పీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు విజ్ఞప్తి చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం కందుకూరు నియోజకవర్గం కార్యకర్తల సమావేశం దువ్వూరి జాన్ అధ్యక్షతన బుధవారం స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందుగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాలతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని చెప్పిన మాట ప్రకారం పథకాలన్నీ అమలు చేయడంలో చిత్తశుద్ధి లోపించిందని అన్నారు. రెండు సంవత్సరాలు గడుస్తున్నా , 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళకు నెలకు 1500 చొప్పున ఇస్తామన్న ఆడబిడ్డ పథకం అమలు కాలేదని విమర్శించారు. లక్షలాది ఉద్యోగాలు కల్పిస్తామని, ప్రతి ఏడాది మెగా డీఎస్సీ ఇస్తామని ఉద్యోగాలు వచ్చేలోపు నిరుద్యోగులందరికీ భృతి కల్పిస్తామని చెప్పిన మాట ఏమైందని ప్రశ్నించారు. ఏడాదికి మూడు సిలిండర్లు అన్న మాట ఎటు పోయిందోనని ఎద్దేవా చేశారు. నేడు యుద్ధం పేరుతో కేంద్రం గృహ అవసరాలకు వినియోగించే సిలిండర్ 60, వాణిజ్య అవసరాల సిలిండర్ ధర 115 రూపాయలకు పెంచి ప్రజల మీద భారం మోపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్త్రీ శక్తి పథకం పేరుతో మహిళలందరికీ ఉచిత బస్సు సౌకర్యం అన్నమాట సంపూర్ణంగా అమలులోకి రాలేదని ఆయన అన్నారు. ప్రకాశం జిల్లాలో 769 పంచాయతీలు ఉండగా సగం పంచాయతీలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదని, మరి ఆ గ్రామాల్లో ఉన్న మహిళలకు ఏ విధంగా ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా బస్సు సౌకర్యం పెంచాలని నివాస ప్రాంతాలన్నిటికీ బస్సు ఏర్పాటు చేసి ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్నీ నిలబెట్టుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రతి పేద కుటుంబానికి గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు చొప్పున లక్షలాది ఇంటి స్థలాలు, పక్కా గృహాలు నిర్మిస్తామన్నమాట ఇంతవరకు అడుగు ముందుకు పడలేదని అన్నారు. గత ప్రభుత్వ కాలంలో జగనన్న కాలనీల పేరుతో ఇచ్చిన లేఔట్లలో మౌలిక వసతులు లేకపోవడం, నిర్మాణ వ్యయం విపరీతంగా పెరగటంతో పేదలు ఇంటి నిర్మాణాలు చేపట్టలేకపోయారని ఫలితంగా అక్కడ కంపచెట్లు మొలుస్తున్నాయని అన్నారు. ప్రభుత్వం తక్షణమే పేదలకు ఇంటి స్థలాలు, పక్కా గృహాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. చిత్తశుద్ధితో హామీలు అమలు చేయకపోగా, రాష్ట్రంలో ఎప్పుడూ లేనివిధంగా మతం చుట్టూ, గుడి చుట్టూ లడ్డు చుట్టూ రాజకీయాల నడుపుతున్నారని, ఇది లౌకిక సాంప్రదాయాలతో కూడిన మన రాష్ట్ర ప్రజలకు తీవ్ర నష్టాన్ని కలిగిస్తుందని అన్నారు. మతతత్వ రాజకీయాలు కట్టిపెట్టి ఇచ్చిన వాగ్దానాల అమలుకు ప్రభుత్వం కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సిఐటియు నాయకులు గంటెనపల్లి వెంకటేశ్వర్లు, ఎస్ ఎ .గౌస్ బాషా, జివిబి కుమార్, మిట్టనోసల సుభాను, డి.మాలకొండ రాయుడు, పొందూరి కొండమ్మ తదితరులు పాల్గొన్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546